## క్లుప్తంగా

### నేడు వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: శ్రీ సత్యసాయి సేవా సంస్థ మొబైల్ వ్యాన్ వైద్య శిబిరాన్ని ఇబ్రహీంపట్నం లోని కేవీ తండాలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సభ్యులు చంద్రశేఖర్ తెలిపారు. ఈ శిబిరం ఉ.8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు నిర్వహిస్తామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి


పోలీస్ కవాతులో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బాల్‌రాం

ఆమనగల్లు: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆమనగల్లు సీఐ జె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలోని వివిధ కాలనీల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ఎంతో కీలకమన్నారు. బెదిరింపులకు, ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటును వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ బాల్‌రాం, ఏఎస్ఐ యాదయ్య, బాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నేడు బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఉ. 8 గంటలకు ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

### బాధితుడికి పరామర్శ


రవీందర్‌ను పరామర్శిస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామానికి చెందిన రవీందర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు దాడిచేసి గాయపరిచారు. విషయం తెలియడంతో శనివారం ఉదయం రవీందర్‌ను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి ఉన్నారు.

### కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాచారం: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని, చేతి గుర్తుకే ఓటేయాలని నక్కర్తమేడిపల్లిలో శనివారం ఆ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు మోటి శ్రీశైలం, ఎంఆర్‌ఆర్ యువసేన వర్కింగ్ ప్రెసిడెంట్ ముచ్చర్ల సంపత్‌కుమార్, నాయకులు సంగెం మల్లేష్, జంగయ్య గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ గ్యారంటీ పథకాలపై ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూములు, ఉద్యోగాలు వచ్చాయని తెలియజేశారు.

### ఎస్ఐకి సన్మానం


ఎస్ఐని సన్మానిస్తున్న సర్పంచ్‌లు శ్రీశైలం తదితరులు

తలకొండపల్లి: సర్పంచ్‌లు కాడమోని శ్రీశైలం, శ్యాంసుందర్‌రెడ్డి, రమేష్‌యాదవ్‌లు ఎస్ఐ శ్రీనును ఘనంగా సన్మానించారు. తలకొండపల్లి మండల నూతన ఎస్ఐగా శ్రీను ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు శనివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాలతో సన్మానించారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో ఎంపీటీసీ రఘునాయక్, రాజేందర్‌రెడ్డి, శ్రీశైలం, శ్యాంసుందర్‌రెడ్డి, రమేశ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

### ముమ్మర తనిఖీలు..

రూ. లక్ష నగదు స్వాధీనం

ఇబ్రహీంపట్నం: ఎన్నికల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై శనివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో కారులో తరలిస్తున్న లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల అధికారికి ఈ డబ్బులను అప్పగించినట్లు చెప్పారు.

# పూల పండుగ షురూ..

పూల పండుగ వచ్చింది. పల్లె, పట్టణానికి తెచ్చింది.. ఎంగిలి పూల బతుకమ్మ పండుగ సంబురాలు శనివారం ఘనంగా మొదలైయ్యాయి. రంగు రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను ఇళ్ల ముంగిట, ప్రధాన కూడళ్లు, దేవాలయాల వద్ద ఉంచి మహిళలు ఆడిపాడారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. –సాక్షి, నెట్‌వర్క్


ఆమనగల్లు: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఆమనగల్లులో బతుకమ్మతో యువతి


కడ్తాల్: బతుకమ్మతో సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి


ఇబ్రహీంపట్నం: ఈశ్వరాంజనేయ దేవాలయం వద్ద ఆటపాటల్లో మహిళలు


ఇబ్రహీంపట్నం: వ్యవసాయ మార్కెట్ యార్డు బృందావన్ కాలనీలో


ఇబ్రహీంపట్నం: మహంకాళి ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఆమనగల్లు: బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు


యాచారం: కుర్మిద్దలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు


యాచారం: నక్కర్తమేడిపల్లి గ్రామంలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు

## కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి


బీఆర్‌ఎస్ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు

- జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు సర్పంచ్‌ల సంఘం జిల్లా బూడిద రాంరెడ్డి, ఎంపీపీ కృపేశ్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు పిలుపునిచ్చారు. శనివారం రాయపోల్, కర్ణంగూడ, ముకునూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిని నాలుగోసారి గెలిపిస్తే అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నియోజకవర్గం నిలుస్తుందన్నారు. ప్రతి గ్రామానికి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిన ఘనత కిషన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశాల్లో ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు బాలుగైడ్, శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గణేశ్, జగన్నాథం, ప్రవీణ్, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్, సర్పంచ్ బలవంత్‌రెడ్డి, ఎంపీటీసీలు జ్యోతి, శ్రీశైలం, ఉపసర్పంచ్ బాల్‌రాజ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఈశ్వర్, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేద్దాం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్‌ఎస్ పార్టీని మరోమారు గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసిన ప్రభుత్వం బీఆర్‌ఎస్ మాత్రమే నన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణకు చేసిందేమి లేదన్నారు. నియోజకవర్గంలో మంచికి మారుపేరైన మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి తిరుగులేదన్నారు. పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. గతం కంటే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ప్రభుత్వం సహకారంతో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అత్యధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.

### వైద్య శిబిరాలతో మేలు

శేరిగూడ సర్పంచ్ మైలారం సత్యనారాయణ

శంకర్‌పల్లి: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు కలుగుతుందని శేరిగూడ సర్పంచ్ మైలారం సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఉచిత వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యల పట్ల ఎప్పటికప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రైయివేటు ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితులు దాపురించాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆలయాన్ని తొలగించొద్దు

అబ్దుల్లాపూర్‌మెట్ : విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెద్దఅంబర్‌పేటలోని లక్ష్మారెడ్డి పాలెంలో గల అభయాంజనేయస్వామి దేవాలయం, జమ్మి హనుమాన్ ఆలయాలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్న సమాచారంతో వందలాది మంది హనుమాన్ భక్తులు శనివారం ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. ఎన్నో ఏళ్లుగా పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి దేవాలయాన్ని రోడ్డు విస్తరణ సాకుతో పూర్తిగా తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయాన్ని తొలగించకుండా ఏదైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు ఆలయం ఎదుట నిరసన తెలిపారు.


నిరసన తెలుపుతున్న స్థానికులు

## కిషన్‌రెడ్డి గెలుపునకు కృషి

మంచాల: మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ అన్నారు. శనివారం మంచాల మండలంలోని లోయపల్లి, ఆంబోత్ తండా, బోడకొండ, ఆరుట్ల, నోముల, బండలేమూర్,కాగజ్‌ఘట్, తిప్పాయి గూడ, తాళ్లపల్లి గూడ, చిత్తాపూర్, జాపాల గ్రామాల్లో బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిందన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పించిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి జరగాలంటే కచ్చితంగా బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, నాయకులు జ్ఞానేశ్వర్, దండేటికార్ రవి, కుకుడాల రాంరెడ్డి, రఘుపతి, వెంకటేష్ గౌడ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న రమేష్ తదితరులు

## ముమ్మాటికి ప్రభుత్వ హత్యే

బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్

తలకొండపల్లి: నిరుద్యోగ యువతి ప్రవల్లిక టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. పరీక్షలు వరుస లీకులు, వాయిదాలతో విరక్తి చెంది ప్రవళిక ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళను చేపట్టనున్నారని భావించి పోలీసులు పక్కా సమాచారంతో నిఘా పెట్టారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులను శనివారం తెల్లవారు జామున ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం స్వంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు తిర్మణీ రవిగౌడ్ మాట్లాడుతూ.. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని మండిపడ్డాడు. గత మార్చి నెలలో బోర్డును రద్దు చేసి కొత్త బోర్డును నియమించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు తిర్మణి రవిగౌడ్, శివ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అజీం, రవీందర్‌యాదవ్, తదితరులున్నారు.


పోలీస్ స్టేషన్‌లో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ పూజలు

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ పూజలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ఫల పంచామృత అభిషేకం, అలంకరణ, పత్రిపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, సత్యనారాయణ స్వామి వ్రతం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, భక్తిమార్గంలో నడవాలని సూచించారు. శ్రీనునాయక్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యా నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీటీసీ రాములుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, భక్తులు

## కష్టపడే వారికే పార్టీ టికెట్

ఆమనగల్లు: కాంగ్రెస్‌పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన వారికే కల్వకుర్తి టికెట్ కేటాయించాలని మాడుగుల మండల యువజన కాంగ్రెస్ నాయకులు కోరారు. శనివారం యువజన కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిని ప్రకటించిన అనంతరం భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.


రాఘవేందర్‌రెడ్డితో యువజన కాంగ్రెస్ నాయకులు

## ఎస్సీ రిజర్వేషన్ సాధించే వరకు పోరు

ఎమ్మార్పీఎస్ నాయకుడు మహేష్

యాచారం: ఎస్సీ రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం తప్పదని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొమ్ము మహేష్ హెచ్చరించారు. మందకృష్ణ మాదిగ చేపట్టిన విశ్వరూప మహాజన పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మాల్ కేంద్రంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఎస్సీ రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణ చేపట్టకపోతే జరగబోయే ఎన్నికల్లో మాదిగ, ఉపకులాలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. మాదిగలను ఓట్ల కోసమే వాడుకోవడం తప్పా చేసిందేమి లేదని ఆరోపించారు. కార్యక్రమంలో యాచారం మండల ఇన్‌చార్జి లింగం, నాయకులు జగన్, ఎండీ సలీం, చిన్నోళ్ల పోచయ్య, జంగయ్య, హరికృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

ఇబ్రహీంపట్నం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు పట్నం ముస్తాబు అయ్యింది. స్థానిక ఈశ్వరాంజనేయ, లక్ష్మీనృసింహస్వామి, మహంకాళి దేవాలయాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 35 సంవత్సరాలుగా భారీ సెట్టింగ్‌లతో మండపాన్ని ఏర్పాటు చేసి దుర్గామాతను ప్రతిష్ఠించి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు.

ఆమనగల్లు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో నేటి నుంచి 25వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ తెలిపారు. ఉత్సవాలలో భాగంగా 15న అమ్మవారికి బాలత్రిపురసుందరీ దేవి అలంకారం, 16న శాకాంబరీదేవి, 17న గాయత్రిదేవి, 18న ధనలక్ష్మిదేవి, 19న అన్నపూర్ణాదేవి, 20న సరస్వతిదేవి, 21న లలితాదేవి, 22న దుర్గాదేవి,23న మహిషాసుర మర్థినిదేవి, 24న రాజరాజేశ్వరీదేవి, 25న దుర్గాదేవి అలంకారంలో అమ్మవారికి పూజ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. అలాగే, భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ఈనెల 15 నుంచి 25 వరకు శ్రీ రాజరాజేశ్వరీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎంగలి బాల కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 25న అమ్మవారి శోభాయాత్ర నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.


వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి

## జైపాల్‌యాదవ్‌ను మరోమారు ఆశీర్వదించండి


మాట్లాడుతున్న మిషన్ భగీరథ రాష్ట్ర వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ తదితరులు

జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్

తలకొండపల్లి: కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను గెలిపించాలని మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ కోరారు. శనివారం మండల పరిధిలోని పెద్దూర్‌తండా, వెంకటాపూర్‌తండా, వెంకటాపూర్ గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అనేక సంక్షేమాభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి బడుగు బలహీన వర్గ ప్రజలకు అండగా నిలిచిందన్నారు. కేసీఆర్ గెలిస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. జైపాల్‌యాదవ్ నియోజకవర్గానికి అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేశాడని అన్నారు. ఆయన మళ్లీ గెలిస్తేనే మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. ప్రతిపక్షాల నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ తిర్మణీ నిర్మలా శ్రీశైలంగౌడ్, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ నర్సింహ, సర్పంచ్ జగ్గి, లలిత, జ్యోతయ్య, గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, కిషన్, శక్తి శ్రీశైలంగౌడ్, రమేష్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

# యువ ఓటర్లే కీలకం

- నగానికి పైగా ఉన్న యువత
- యువకులను ఆకర్షించే పనిలో పార్టీలు

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గంలో యువత ఓట్లే కీలకం కానున్నాయి. అభ్యర్థుల గెలుపోటములను యువ ఓటర్లు నిర్ధారించనున్నారు. నియోజకవర్గంలో 19 నుంచి 39 సంవత్సరాలు వయసు గల ఓటర్లు సగానికి పైగా ఉన్నారు. దీనితో జయాపజయాలను యువ ఓటర్లు శాసించనున్నారని పలువురు విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

### మొత్తం ఓటర్లు 2,30,650


కల్వకుర్తిలో మొత్తం ఓటర్లు 2,30,650 మంది ఉన్నారు. మహిళలు 1,13,250 మంది, పురుషులు 1,17,393, థర్డ్ జెండర్ 7 మంది ఉన్నారు. ఇందులో కడ్తాల్ మండలంలో 32,019 మంది ఓటర్లు, తలకొండపల్లి మండలంలో 35,272, కల్వకుర్తి రూరల్‌లో 29,746, కల్వకుర్తి మున్సిపాలిటీలో 23,766, వెల్దండ మండలంలో 31,565, ఆమనగల్లు మండలంలో 29,941, మాడుగుల మండలంలో 41,579, చారకొండ మండలంలో 6,757 మంది ఓటర్లు ఉన్నారు.

### యువ ఓటర్లే ఎక్కువ

నియోజకవర్గంలో 18 నుంచి 39 సంవత్సరాలు వయసు ఉన్న ఓటర్లు 1,20,070 మంది ఉన్నారు. ఇందులో 18 నుంచి 19 సంవత్సరాల వారి 6519 మంది ఓటర్లు, 20 నుంచి 29 సంవత్సరాల వారు 46134 మంది ఓటర్లు, 30 నుంచి 39 సంవత్సరాల ఓటర్లు 67417 మంది ఉన్నారు. దీనితో కల్వకుర్తి అసెంబ్లీ బరిలో నిలిచే అభ్యర్థుల భవితవ్యాన్ని యువ ఓటర్లు నిర్ధారించే అవకాశం ఉంది.

### ఓటు నమోదుకు అవకాశం

అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. నిరంతరం ఓటు నమోదు, బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నెల 4న తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. అయినా కొత్తగా ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. 18 ఏళ్లు నిండినవారు, ఓటరు జాబితాలో చోటు దక్కనివారు ఈ నెల 31 వరకు ఓటు కోసం నమోదు చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. మీ సేవా కేంద్రంలో లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఫారం నంబర్ 6ను నింపి ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.


కల్వకుర్తి ముఖచిత్రం